సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 29 । జనవరి । 2023

కదిలింది.. కడప రాయుని రథం



భక్తజన సందోహం మధ్యన తేరుపై కడప రాయుని విహారం (ఇన్‌సెట్‌) ఉభయ దేవేరులతో తేరుపై కొలువుదీరిన కడప రాయుడు

కడప కల్చరల్ : జనం.. జనం.. భక్తజనం .. ఆ జన సంద్రం మధ్యన కడప రాయుని రథం కదిలింది. బ్రహ్మదేవుడు సారధ్యం వహించినట్లుగా అలంకరించిన రథం విశ్వ తేజోమూర్తి సూర్యుని సాక్షిగా, మహా మేరు పర్వతంలా జనసంద్రం మధ్యన ఆ భారీ రథం గంభీరంగా సాగింది. దేవునికడప మాఢవీధుల్లో జనం సందడి నెలకొంది. భక్తులు రథంపై స్వామిని దర్శించుకుని జయజయధ్వానాలు చేస్తూ జన్మధన్యమైందని మైమరచిపోయారు. కడప రాయుని బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవాన్ని నిర్వహించారు. మిద్దెలు, మేడలపై నుంచి కూడా భక్తులు స్వామి రథంలో దేవదేవుడిని తిలకించి పులకించారు. కడప రాయుడు దేవునికడప

ఘనంగా రథోత్సవం

శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఉదయం స్వామి వారిని రథంపై కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. దాదాపు మధ్యాహ్నం 2.30 గంటల వరకు దర్శనాల కోసం భక్తులు బారులు తీరి వేచి ఉండి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు, స్థానిక అధికారులు తొలి పూజలు చేసి కొబ్బరికాయలు, హారతులు ఇచ్చి రథాన్ని కదిలించారు. దేవునికడప, పాతకడప, మోడమీదిపల్లె యువత కట్టలు తెంచుకున్న ఉత్సాహంతో కదం తొక్కుతూ రథ చక్రాల కింద వెనక నుంచి కొయ్య మొద్దులు వేసి వెదురు కర్రల సాయంతో ముందుకు కదిలించారు. ముందువైపు భక్తజనం పోటీలుపడి గొలుసులతో రథాన్ని లాగారు. ముక్కలు గల భక్తులు రథ చక్రాల కింద గుమ్మడికాయలను ఉంచి ఆ ముక్కలను ప్రసాదంగా స్వీకరించారు. అర్చకులు అడుగడుగునా రథంపై నుంచి ప్రజలకు స్వామి వారి హారతులిచ్చారు. రథంపై నుంచి యువతను ప్రోత్సహిస్తూ రథోత్సవం సక్రమంగా సాగేందుకు సూచనలిచ్చారు. ఈ మంగళకరమైన ఘట్టాన్ని తిలకించేందుకు దేవునికడప మాఢ వీధులన్నీ జనమయమయ్యాయి. ఆ వీధుల్లోని మిద్దెలు, మేడలన్నీ జనంతో నిండిపోయాయి. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య సాయంత్రం రథం ముందున్న చోటుకు చేరింది.

న్యూస్‌రీల్

నిర్ణీత కాలంలో ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు నిర్ణీత కాలంలో లబ్ధిదారులకు జారీ చేయాలని కలెక్టర్ గిరీషా పీఎస్ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. శనివారం రాయచోటి మండలం చెన్నముక్కపల్లె–2 గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయానికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ తనిఖీలో రాయచోటి తహసీల్దార్ రవిశంకర్‌రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

రేపు స్పందన తాత్కాలిక రద్దు

రాయచోటి: ఈనెల 30వ తేదీన నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం, అదే రోజు రాష్ట్ర ముఖ్యమంత్రిచే జగనన్న చేదోడు పథకం కింద అర్హులకు లబ్ధి పంపిణీ కార్యక్రమం దృష్ట్యా రద్దు అయినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు రాయచోటికి స్పందనలో ఫిర్యాదులు అందజేసేందుకు రావద్దని సూచించారు.

అత్తిరాలలో టెంకాయల వేలంపాట

రాజంపేట రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం టెంకాయల వేలం పాట నిర్వహించారు. ఏడాదిపాటు టెంకాయలు విక్రయించుకునేందుకు నిర్వహించిన వేలం పాటను మందరం గ్రామానికి చెందిన మల్లెం రెడ్డెయ్య రూ.6లక్షల 70వేలకు దక్కించుకున్నట్లు ఈఓ జి.కొండారెడ్డి, దేవస్థానం చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

శ్రీరస్తు.. శుభమస్తు

సందడిగా పెళ్లి పందిళ్లు.. మోగుతున్న బాజాభజంత్రీలు.. పట్టుచీరల గలగలలు...పెద్దల ఆశీస్సులు...యువత హడావుడి....అంతటా కల్యాణ రాగాలు.. జిల్లాలో మార్చి వరకు అత్యంత శుభకరమైన, మంగళకరమైన వివాహ ముహూర్తాలు ఉండడంతో తమ బిడ్డలకు మంచి జరుగుతుందని పెద్దలు వివాహాలు నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ మాసమంతా ముహూర్తాలు లేవు గనుక ఆ తర్వాత ఎండాకాలం తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వివాహాలు కానిస్తున్నారు. జిల్లా అంతటా పెళ్లి సందళ్లు కనిపిస్తున్నాయి..

- జిల్లా వ్యాప్తంగా శుభకార్యాల సందడి
- మోగుతున్న పెళ్లి బాజాలు
- పురోహితులు, వివిధ రంగాల కళాకారులకు డిమాండ్



రాజంపేట టౌన్: మాఘమాసం ప్రారంభం కావడంతో జిల్లా వ్యాప్తంగా పెళ్లిళ్ల సందడి ఊపందుకుంది. ముహూర్తాలు ఉన్న రోజు పెళ్లిబాజాలు మోగుతున్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహప్రవేశాలు, ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు, నిశ్చితార్థాలు, అన్నప్రాసన, ఉపనయనం, అక్షరాభ్యాసం వంటి శుభకార్యాలకు అనేక మంది ప్రజలు ముహూర్తాలను కూడా ఖరారు చేసుకున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి వివాహాలు, ఇతర శుభకార్యాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది మార్చి 17వ తేదీ వరకు వివిధ రోజుల్లో శుభముహూర్తాలు ఉన్నట్లు పురోహితులు చెబుతున్నారు.

కల్యాణ మండపాలకు డిమాండ్

గత ఏడాది నవంబర్‌లో, డిసెంబర్ మొదటి వారంలో మంచి ముహూర్తాలు ఉన్న కారణంగా వేలాది వివాహాలు జరిగాయి. అయితే ఆ సమయంలో వివాహాలు నిర్వహించుకోలేక పోయిన వారు, ఇటీవల వివాహాలు కుదిరిన వారు మాఘమాసం, ఫాల్గుణ మాసంలో వివాహ కార్యక్రమాలను తలపెట్టుకున్నారు. అందువల్ల ముహూర్తాలు ఉన్న రోజుల్లో అన్ని కల్యాణ మండపాలు బుక్ అయిపోయాయి. కల్యాణ మండపాలు దొరకని వారు తమ ఇళ్లవద్ద, విశాలమైన ఖాళీ స్థలాల్లో వివాహాలను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

జోరుగా సాగుతున్న అనుబంధ వ్యాపారాలు

వివాహాలు, శుభకార్యాల సీజన్ ప్రారంభం కావడంతో వివిధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ప్రధానంగా దుస్తులు, బంగారు, అలంకరణ వస్తువులు, శుభకార్యాలకు అవసరమయ్యే సామగ్రి, పూల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. శుభకార్యాలు ముగిశాక దగ్గరి బంధువులు కొద్ది రోజుల పాటు శుభకార్యాలు జరుపుకున్న వారి ఇంటిలో ఉండనున్నందున నిత్యావసర వస్తువుల వ్యాపారం కూడా ఊపందుకుంది.

అనేక మందికి ఉపాధి

కరోనా సమయంలో ఉపాధి లేక వివిధ వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే గత ఏడాది నుంచి కరోనా ప్రభావం లేక పోవడం దీనికి తోడు నవంబర్ నుంచి శుభముహూర్తాలు ప్రారంభం కావడంతో అనేక మందికి చేతినిండా పనిదొరికి పుష్కలంగా ఉపాధి లభిస్తోంది. ప్రస్తుతం వివాహాలు, శుభకార్యాలు ప్రారంభం కావడంతో ప్రధానంగా పురోహితులకు, డెకరేషన్, మంగళ, బ్యాండు వాయిద్య కళాకారులకు, ఫొటో, వీడియో గ్రాఫర్స్, కల్చరల్ ఈవెంట్ ఆర్గనైజర్స్ (ఆర్కెస్ట్రా), క్యాటరింగ్, బ్యూటీపార్లర్ నిర్వాహకులకు, ట్రావెల్స్ ఏజెన్సీలకు మెండుగా డిమాండ్ ఏర్పడింది. అందువల్ల ఆయా వ్యాపార వర్గాల వారికి చేతినిండా పని లభించడంతో శుభకార్యాలు వారి ఉపాధికి దోహదపడుతున్నాయి.

రెండు నెలల క్రితమే అడ్వాన్సులు ఇచ్చారు



మాఘమాసం, ఫాల్గుణ మాసంలో ఎక్కువ సంఖ్యలో వివాహాలు, గృహప్రవేశాలు జరుగుతున్నాయి. అందువల్ల ఎక్కువ మంది తమ పిల్లల వివాహం జరిపించాలని, గృహప్రవేశాలు చేయించాలని రెండు నెలల క్రితమే అడ్వాన్సులు ఇచ్చారు. కొంతమంది ఆలస్యంగా రావడం వల్ల వారు కుదుర్చుకున్న ముహూర్తాన వివాహాలకు, గృహప్రవేశాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. –నంద్యాల కృష్ణమోహన్‌శర్మ, పురోహితుడు, రాజంపేట

స్టేటస్ కోసం.. తగ్గేదేలే

ప్రస్తుతం ధనవంతులు తమ పిల్లలకు జరిపే వివాహాలు వారి స్టేటస్‌కు సింబల్‌గా మారాయి. ఆర్థిక పరిపుష్టి గల వారు వివాహాల కోసం ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా ప్రతిదీ గొప్పగా ఉండేలా చూసుకుంటున్నారు. వివాహ సమయంలో డెకరేషన్, విందు కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అలాగే అత్యాధునిక కెమెరాలతో ఫొటోలు, వీడియోలు తీయించేందుకు కూడా లక్షల్లో ఖర్చు చేస్తున్న వారు కూడా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వివాహ విందులో పసందైన వంటలు ఉండేందుకు పేరెన్నికగన్న క్యాటరింగ్ సంస్థలతో అల్పాహారం, భోజనం ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది వివాహానికి వచ్చిన వారికి విలువైన గిఫ్టులు కూడా ఇస్తున్నారు.



మంగళ స్నానం కోసం డెకరేషన్



వివాహ రిసెప్షన్ డెకరేషన్

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- ఆర్జేడీ బండ్లపల్లి ప్రతాపరెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ ప్రతాప్‌రెడ్డి

రాయచోటి: ఏప్రిల్‌లో నిర్వహించనున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని పాఠశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బండ్లపల్లి ప్రతాపరెడ్డి సూచించారు. శనివారం రాయచోటిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ అధికార ప్రిన్సిపాల్‌లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంగ్రహణాత్మక పరీక్షలలో వచ్చిన మార్కుల ఆధారంగా పదవ తరగతి విద్యార్థులను ఏ, బీ, సీ గ్రూపులుగా విభజించాలన్నారు. సీ గ్రూపులోని విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించడానికి ప్రత్యేక ప్రణాళికను అనుసరించాలన్నారు. ప్రభుత్వ బడులలో చదివే పేద బడుగు బలహీనవర్గాల పిల్లల కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టామన్నారు. మన బడి, నాడు–నేడు ద్వారా మౌలిక సదుపాయాలను కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. డీఈఓ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు తప్పనిసరిగా తమ పాఠ్యాంశాలకు సంబంధించి పాఠ్యప్రణాళిక, టీచింగ్ డైరీని కలిగి ఉండాలన్నారు. సబ్జెక్టులకు సంబంధించి ప్రతి విద్యార్థి చేత వర్క్‌బుక్ పూర్తి చేయించాలన్నారు. జగనన్న గోరుముద్దకు సంబంధించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలన్నారు. బాగా పనిచేసే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ప్రోత్సహించే విధంగా తగిన చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి, మదనపల్లి ఉప విద్యాశాఖాధికారులు వరలక్ష్మీ, క్రిష్టప్ప, జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

కిసాన్ డ్రోన్లపై రైతులకు అవగాహన కల్పించండి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

మదనపల్లె: రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులోకి తెస్తున్న కిసాన్ డ్రోన్లపై ఆర్‌బీకే సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏడీఏ శివశంకర్ అధ్యక్షతన మదనపల్లె వ్యవసాయశాఖ డివిజన్ పరిధిలోని ఆర్‌బీకే, ఏఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ప్రతి మండలానికి మూడు చొప్పున డ్రోన్లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ప్రభుత్వం కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఆధ్వర్యంలో వాటి ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కిసాన్‌డ్రోన్లు నడిపేందుకు రైతు గ్రూపుల్లో ఎంపిక చేసిన రైతులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా పైలట్ లైసెన్స్‌తో పాటుగా డీజీసీఏ సర్టిఫికెట్ అందిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ ఖరీదు రూ.10లక్షలు కాగా, అందులో గ్రూపు కంట్రిబ్యూషన్ రూ.1లక్ష, ప్రభుత్వ సబ్సిడీ రూ.4లక్షలు పోగా మిగిలిన రూ.5లక్షలు డీసీసీబీ నుంచి రుణసదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. కిసాన్‌డ్రోన్లతో టమాటా, అరటి, బొప్పాయి తదితర అన్ని పంటలకు లిక్విడ్ ఫెర్టిలైజర్స్ పిచికారీ చేయవచ్చన్నారు. పంటలకు పురుగుమందులు పిచికారీ చేసుకోదల్చుకున్న రైతులకు అద్దెప్రాతిపదికన డ్రోన్లు ఇస్తామన్నారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో మదనపల్లె, తంబళ్లపల్లెలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశామని, వీటిని రైతులు విరివిగా వినియోగించుకునేలా ఆర్‌బీకే సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్‌లు సువర్ణలక్ష్మి, మజీద్‌అహ్మద్, ఏఓ(టెక్నికల్) రమేష్‌రాజు, 8 మండలాల ఏఓలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలి

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి : జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో విచారణను పూర్తి చేసి వాటి పరిష్కారంపై దృష్టి సారించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా నేర సమీక్షా సమావేశాన్ని ఎస్పీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పెండింగ్ కేసుల పరిష్కారం, రోడ్డు ప్రమాదాల నివారణ, వైట్ కాలర్ నేరాల అదుపు తదితర అంశాలపై జిల్లాలోని పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమీక్షలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ముందుగా రహదారి భద్రతలో భాగంగా తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. సబ్–డివిజన్ పరిధిలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్‌ను త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. అలాగే చీటింగ్ కేసుల విషయంపై క్షుణ్ణంగా పరిశీలించి సదరు కేసులలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేసిన విధానాన్ని పరిశీలించి, ఆ కేసుల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆరా తీశారు. దర్యాప్తు దశలో ఉన్న హత్య కేసులు, రేప్, పోక్సో కేసులు, ఆస్తులు, చీటింగ్, మహిళలపై వేధింపులు, మిస్సింగ్ కేసులు, 174 పీఆర్‌సీపీ కేసులు, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్, రోడ్డు ప్రమాదాలు, ఈ–చలానా, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్పందన పిటిషన్లపై వరుసగా సమీక్షించారు.

పోలీస్ శాఖకు వెన్నెముక ఏఆర్ విభాగం

రాయచోటి: పోలీసు శాఖకు ఏఆర్ విభాగం వెన్నెముక లాంటిదని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో సాయుధ దళానికి వార్షిక మొబలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇదే క్రమశిక్షణను మున్ముందు కనబరుస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ అభిలషించారు. మొబలైజేషన్ కార్యక్రమంలో భాగంగా ఏఆర్ విభాగంలోని అధికారులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ రాజ్ కమల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంటలు అంటుకుని బాలికకు గాయాలు

మదనపల్లె : మంటలు అంటుకుని బాలిక గాయపడిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పోకలపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె పి.దీక్షిత(6) ఉదయం వంట పొయ్యికి దగ్గరగా కూర్చుంది. ప్రమాద వశాత్తు గౌనుకు మంటలు అంటుకుని గాయప డింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాలికను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : యువకుడు ఆత్మహత్యకు యత్నిం చిన సంఘటన మదనపల్లె పట్టణంలో శని వారం జరిగింది. రెడ్డీస్‌కాలనీకి చెందిన వెంకట రమణారెడ్డి కుమారుడు జి.నరేష్(27) కుటుం బసమస్యల కారణంగా మాత్రలు మింగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనం లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి



చిన్నపాపులమ్మ మృతదేహం

నిమ్మనపల్లె : ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించిన మహిళ మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మండలపరిధిలోని రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లెకు చెందిన నరసింహులు భార్య చిన్నపాపులమ్మ(40) గురువారం రాత్రి విషపుగుళికలు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. మృతురాలు ఏడాదిక్రితం బోయకొండ నుంచి సోమానుపల్లెకు వచ్చింది. ఈనేపథ్యంలో ఆమె భర్త నరసింహులు అనారోగ్యంతో మృతి చెందడంతో ఇద్దరు పిల్లలతో కలిసి స్థానికంగా కూలీనాలీ చేసుకుంటూ జీవిస్తోంది. భర్త మరణంతో ఒంటరిదైన పాపులమ్మ పిల్లలను పోషించలేక మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సలు పొందుతూ మృతి చెందింది. తల్లి పాపులమ్మ మరణంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలారు. స్థానికులు వారిని అనాథ ఆశ్రమంలో చేర్పించనున్నట్లు తెలిపారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

హార్సిలీహిల్స్‌పై లోతుగా లోకాయుక్త దర్యాప్తు



హార్సిలీహిల్స్‌పై జమున ఇల్లు (ఫైల్)

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి 1974లో ప్రభుత్వం విక్రయించిన భూముల తాజా పరిస్థితులపై లోకాయుక్త లోతైన దర్యాప్తు సాగిస్తోంది. ఓ వ్యక్తి ఫిర్యాదుపై మొదలైన లోకాయుక్త విచారణ ఇప్పుడు లోతుగా సాగుతోంది. సొసైటీ భూముల వ్యవహారంలో ఏమి జరిగింది..భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయి.. నిబంధనలను పాటించారా అన్న కోణంలో దర్యాప్తు మొదలు కావడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ (దర్యాప్తు) గంగరాజు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలుమార్లు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టిన ఆయన సమస్య మూలాలపై దృష్టి పెట్టారు. 1974 నవంబర్ 30 అప్పటి ప్రభుత్వం జీవో ద్వారా హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి మార్కెట్ విలువకు 20.60 ఎకరాలను కట్టబెట్టింది. 1979 నుంచి 1985 వరకు 60 మంది సభ్యులకు ప్లాట్లు కేటాయించగా బినామి పేర్లు, లేని వ్యక్తుల పేర్లతో ప్లాట్లు కేటాయించిన సంగతి లోకాయుక్త విచారణ మొదలయ్యాక వెలుగుచూసింది. విచారణ చేపట్టే ముందు లోకాయుక్తకు 1980లలో స్థలాలు పొందిన సీనియర్ సిటిజన్లు లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లారు. తమకు కేటాయించిన ప్లాట్లు ఉన్నాయా లేవా, లేకపోతే తమకు ఎట్లా కేటాయించారు అన్న అంశాలపై స్పష్టత లేదని ప్లాట్లు కొనుగోలుచేసిన వాళ్లు వాదిస్తున్నారు. ఈ అంశంపై లోకాయుక్త విచారణలో దృష్టి పెట్టింది. 30 ఏళ్ల క్రితం జరిగిన ప్లాట్ల కేటాయింపులో ఏమి జరిగింది, అప్పటి పాలకవర్గంగా పనిచేసిన వాళ్లు ఎవరు, లోపాలు ఎక్కడ జరిగాయి, అప్పటి ప్లాట్లకు సంబంధించి లేఔట్ ఉందా లేదా, ఉంటే ప్రభుత్వ అనుమతి పొందారా, ఎంత ధర నిర్ణయించారు, కేటాయించిన ప్లాట్లను కొనుగోలు చేసిన వారికి స్థలాలను ఎందుకు చూపలేదు? అన్న ఎన్నో ప్రశ్నలకు ఇప్పుడు లోకాయుక్త సమాధానాలు వెతికే పనిలో పడింది.

సమస్య వద్దకే విచారణ

సొసైటీ భూముల విషయంలో కోర్టు కేసులు, ఆక్రమిత భూములు, రెవెన్యూ ఆధీనంలోని సీజ్ చేసిన భూముల వ్యవహారాలు ఉన్నాయి. ఇందులో దర్యాప్తు అధికారి గంగరాజు సమస్యకు మూలమైన అంశంపై దృష్టి పెట్టారు. సొసైటీకి ప్రభుత్వం విక్రయించిన భూములు సొసైటీకే చెందుతాయని 2013లో సీసీఎల్ఓ తీర్పు చెప్పింది. దీనిపై రెవెన్యూ అధికారులు హైకోర్టును ఆశ్రయించగా కేసు నడుస్తోంది. ఈ భూమిలోనే గతంలో ఓ పాఠశాల నిర్వహణ ఉండేది, ఈ పాఠశాలను మూసివేసినట్టు సంబంధిత యజమాన్యం ప్రకటించిన సమాచారాన్ని అధికారులు సేకరించారు. రెవెన్యూ అధికారుల ఆధీనంలోని భూమి తాజా స్థితి, కొత్తగా ప్లాట్ల కేటాయింపు, కోర్టులు ఇచ్చిన ఉత్తర్వులు అన్నింటిని విచారణ అధికారి సమగ్రంగా పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

భూ కేటాయింపు లేకనే ప్లాట్లు

హార్సిలీహిల్స్‌పై మరో వింత వెలుగుచూసింది. 1974లో ప్రభుత్వం సొసైటీకి భూములు కేటాయించగా, అంతకుముందు 1965లో సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేసిన ఓ సహకార అధికారి కొందరికి ప్లాట్లు కేటాయించారని తెలుస్తోంది. అప్పట్లో సినీనటి జమున సహా ఓ మాజీ ఎంపీ, ఓ ప్రముఖ కుటుంబానికి చెందిన ఒకరికి..ఇలా 40 మంది వరకు ప్లాట్లు కేటాయించిన ఆ అధికారి, ప్రభుత్వం భూమి కేటాయించిన తర్వాత వారికి రిజిస్ట్రేషన్లు చేయించినట్టు సమాచారం. ఈ వ్యవహారంపై సొసైటీ ప్రతినిధులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు జరగలేదని కేసు దాఖలు చేసింది. ఈ వ్యవహారం ఇంకా మదనపల్లె కోర్టులో నడుస్తోంది.

ఆగిన జమున ఇంటి రిజిస్ట్రేషన్

సినీనటి జమున హార్సిలీహిల్స్‌పై ఇంటిని నిర్మించుకున్నారు. కొన్నేళ్లపాటు ఇక్కడికి ఆమె రాకపోకలు సాగించారు. చాలాకాలం పాటు జమున తల్లి ఈ ఇంటిలో నివాసం ఉండేవారు. తర్వాత ఆ ఇంటిని విక్రయించారు. నలుగైదుగురు ఈ ఇంటిని కొనుగోలు చేయడం, విక్రయించడం జరిగింది. చివరగా చెన్నైకి చెందిన వ్యక్తి కొనుగోలు చేయగా ప్రస్తుతం తంబళ్లపల్లె నియోజకవర్గానికి ఓ ఎస్‌ఆర్‌ఐ కొనుగోలు చేశారు. అయితే రిజిస్ట్రేషన్లపై నిషేధం ఉండటంతో ఆగిపోయింది. దీనితో కొనుగోలు చేసిన వ్యక్తి కోర్టును ఆశ్రయించారు.

చెక్‌డ్యామ్ ధ్వంసం, వంక ఆక్రమణలపై విచారణ



వంక ఆక్రమణ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ, రెవెన్యూ సిబ్బంది

గుర్రంకొండ : ఏనుగులచెరువు వంకలో ఉన్న చెక్‌డ్యామ్ ధ్వంసం, చెరువు వంక ఆక్రమణలపై తహసీల్దార్ ఖాజాబీ విచారణ నిర్వహించారు. గుర్రంకొండ, ఖండ్రిగ గ్రామాల మధ్యలో ఏనుగుల చెరువుకు వర్షపునీరు వెళ్లే కొండ వంక ఉంది. గతంలో వంకలో చెక్‌డ్యామ్ కుడా నిర్మించారు. రెండురోజుల క్రితం కొంతమంది వ్యక్తులు జేసీబీలతో చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేయడంతో పాటు వంక చదనుచేసేసి ఆక్రమించే యత్నాలు చేశారు. ఈసంఘటనపై తహసీల్దార్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో శనివారం తహసీల్దార్ ఖాజాబీ సిబ్బందితోకలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇలా ఆక్రమించుకొంటూ పోతే చెరువుల్లోకి నీరు ఎలా చేరుతుందని ప్రశ్నించారు. మొత్తం ఏనుగులచెరువు వంక స్థలాన్ని సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు. ఇకపై ఎవరైనా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీకేటీ, ప్రభుత్వ స్థలాలను ఇష్టానుసారం ఆక్రమించుకొంటే చర్యలు తప్పవన్నారు. సదరు వివాదాస్పద భూములకు చెందిన రైతులందరూ భూరికార్డులు తీసుకొని తహసీల్దార్ కార్యాలయంలోకి విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. అంతవరకు ఈ భూముల్లో జేసీబీలతో చదును చేసే పనులు నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ చంద్రశేఖర్, మండలసర్వేయర్ రెడ్డిశేఖర్, వీఆర్వో ముక్తియార్, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడిని ఇంటిలో వదిలి..
విధులకు వెళుతూ..

రోడ్డుప్రమాదంలో సీఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్ మృతి



అరుణాదేవి మృతదేహం

మదనపల్లె : భార్యాభర్తలిద్దరూ దేశ సేవలో సిపాయిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకుని తమతో పాటు ఉంచుకోలేక విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకుడ్ని చేద్దామని భర్త ఇంటికి సమీపంలోని ఓ కార్పొరేట్ స్కూల్లో చేర్పించారు. సంక్రాంతి సెలవులకు ఆమె పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చింది.కుమారుడిని పుట్టింటికి తీసుకెళ్లింది.సెలవులు అయ్యాక పిల్లవాడిని అత్త వారింటిలో దింపి విధులకు వెళ్లే క్రమంలో విధి ఆడిన నాటకంలో ప్రాణాలు కోల్పోయింది. బిడ్డను ఒంటరి చేసి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. శనివారం వేకువ జామున మదనపల్లె ఆరోగ్య వరం సమీపంలోని తురకపల్లి వద్ద ఆటో ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో సీఆర్‌పీఎఫ్ మహిళా కానిస్టేబుల్ అరుణాదేవి (38) మృతి చెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు..

మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ రాయనచెరువు వడ్డిపల్లెకు చెందిన రవీంద్ర ఇండియన్ ఆర్మీలో హవల్దార్‌గా జమ్మూకాశ్మీర్‌లో పనిచేస్తున్నారు. విజయవాడకు చెందిన అరుణాదేవి పశ్చిమబెంగాల్ భారత సరిహద్దుల్లో సీఆర్పీఎఫ్ జవాన్‌గా పనిచేస్తోంది. వీరిద్దరి ఏకైక సంతానం హర్షవర్ధన్‌ను చదువుల నిమిత్తం మదనపల్లెలోని కార్పొరేట్ పాఠశాలలో చేర్పించారు. అరుణాదేవి సంక్రాంతి సెలవులకు 16న రాష్ట్రానికి వచ్చింది. మదనపల్లెకు వచ్చి కుమారుడిని తీసుకుని విజయవాడకు వెళ్లింది. కొద్దిరోజులు అక్కడ సంతోషంగా గడిపింది. శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి బయలుదేరి శనివారం వేకువజామున 3 గంటలకు మదనపల్లెకు చేరుకుంది. స్థానికంగా ఆటోను బాడుగకు తీసుకుని కుమారుడితో పాటు రాయనచెరువు వడ్డిపల్లెకు వెళ్లింది. మెట్టినింట కొడుకును విడిచిపెట్టి, విధులకు వెళుతున్నానని చెప్పి అదే ఆటోలో తిరుగుప్రయాణమైంది. మార్గమధ్యలో తురకపల్లె వద్ద వేకువజామున పొగమంచు కారణంగా ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని గమనించి హఠాత్తుగా ఆటోను పక్కకు తిప్పడంతో ట్రాక్టర్ ట్రాలీ ఆటోకు తగిలి బోల్తాపడింది. ప్రమాదంలో అరుణాదేవి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను అదే ఆటోలో డ్రైవర్ మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించాడు. వైద్యులు చికిత్స అందిస్తుండగా ఆమె మృతిచెందింది. ప్రమాద విషయం తెలుసుకున్న బంధువులు, కుమారుడు హర్షవర్ధన్ ఆస్పత్రికి చేరుకున్నారు. భార్య మరణించిన విషయాన్ని భర్త రవీంద్రకు తెలిపారు. ప్రమాదఘటనతో రాయనచెరువు వడ్డిపల్లెలో విషాదఛాయలు నెలకున్నాయి. మదనపల్లె తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు

- రెవెన్యూ అధికారులు, పోలీసులను అడ్డుకున్న సర్పంచ్
- ఆత్మహత్యకు యత్నించిన వైనం



సర్పంచ్ శ్రీహరితో మాట్లాడుతున్న తహసీల్దార్, పోలీసులు

పుల్లంపేట : పుల్లంపేట మండలం, తిప్పాయిపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు. 619లో 9 ఎకరాల ప్రభుత్వభూమిని వరదాయిగారిపల్లె సర్పంచ్ ఆక్రమించుకున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శనివారం పుల్లంపేట తహసీల్దార్ నర సింహ కుమార్ పోలీసు సిబ్బందితో వెళ్లి ఆక్రమించిన భూమి కంచెను తొలగించాలని సర్పంచ్ శ్రీహరి కుటుంబ సభ్యులను కోరారు. కంచెను తొలగిస్తే ఆత్మహత్య చేసుకుంటానని సర్పంచ్ తహసీల్దార్ ఎదుట తన శరీరంపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్రం చేశాడు. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ నరసింహ కుమార్‌ను వివరణ కోరగా సర్వే నంబరు. 619లో దళితులకు భూమిని ఇచ్చేందుకు అసైన్మెంట్ కమిటీలో ప్రతిపాదనలు పంపించామన్నారు. భూమిలో కబ్జా జరుగుతుందనే సమాచారం రావడంతో ఆక్రమణదారులను అడ్డుకున్నామని చెప్పారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

విజిలెన్స్ ఆఫీసర్ పేరుతో బెదిరింపులు

వ్యక్తిపై కేసు నమోదు

కడప అర్బన్ : విజిలెన్స్ ఆఫీసర్ పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్ వారిని బెదిరింపులకు గురిచేస్తున్న వైఎస్సార్‌జిల్లా పెండ్లిమర్రి మండలానికి చెందిన నంద్యాల వెంకట గంగరాజుపై కేసు నమోదు చేసినట్లు కడప వన్‌టౌన్ సీఐ ఎన్‌వీ నాగరాజు తెలిపారు. కడప స్మిత్ రోడ్డులో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ స్కిల్ ట్రైనింగ్‌సెంటర్‌లో వివిధ రకాల శిక్షణలను ఇస్తూ వారికి ప్రభుత్వం తరుపున ప్రయోజనాన్ని చేకూరేలా చేస్తున్నట్లు మేనేజర్ షేక్ ఖాదర్‌బాషా తెలియజేశారు. కొంతకాలంగా ఓ అపరిచిత వ్యక్తి తమను అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు చేస్తూ భయాందోళనలకు గురి చేసేవాడన్నాడు. తాను విజిలెన్స్ ఆఫీసర్ అని, రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసేవాడు. శనివారం సాయంత్రం ఇన్‌స్టిట్యూట్ వద్దకు వెళ్లిన నిందితుడు నంద్యాల వెంకట గంగరాజు మేనేజర్ షేక్ ఖాదర్‌బాషా ఐడీ కార్డును చూపాలని నిలదీశారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. పరస్పరం ఘర్షణకు పాల్పడ్డారు. ఈ క్రమంలో జనం పోగవడంతో నిందితుడు పరారయ్యాడు.షేక్ ఖాదర్‌బాషా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ఏఆర్ మొబిలైజేషన్‌లో ఫైరింగ్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న ఏఆర్ సిబ్బంది

కడప అర్బన్ (వైఎస్సార్‌జిల్లా): ఏఆర్ మొబిలైజేషన్‌లో భాగంగా శనివారం ఏఆర్ సిబ్బందికి వార్షిక ఫైరింగ్ శిక్షణను నిర్వహించారు. కడప నగర శివార్లలోని రాజీవ్ స్మృతివనం వద్ద ఉన్న ఫైరింగ్ రేంజ్‌లో ఏఆర్ సిబ్బందికి ఫైరింగ్‌లో మెలకువలను వివరించారు. ఏఆర్ డీఎస్పీ రమణయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. దీంతో పాటు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తుపాకీని ఎలా ఉపయోగించాలి, తుపాకీ నిర్వహణ, ఎస్‌ఎల్‌ఆర్ తుపాకీతో డ్రిల్ నిర్వహణపై ఏఆర్ పోలీస్ ఉన్నతాధికారులు మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సోమశేఖర్‌నాయక్, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ



బాధితుడికి సెల్‌ఫోన్ ఇస్తున్న ఆర్టీసీ డీఎం కుమార్

పీలేరు : ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితునికి అప్పగించి ఆర్టీసీ కండెక్టర్ తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం దిగవగల్లకు చెందిన రామకృష్ణ శనివారం ఉదయం స్వగ్రామం నుంచి పీలేరుకు వచ్చారు.బస్టాండులో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. విధినిర్వహణలో ఉన్న కండక్టర్ ఆదినారాయణకు సెల్‌ఫోన్ దొరికింది.అతను దానిని ఆర్టీసీ డీఎం కుమార్‌కు అందించాడు. బాధితుడి వివరాలు తెలుసుకుని సెల్‌ఫోన్‌ను ఆయనకు అప్పగించారు. ఆదినారాయణను అభినందించారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ సుబ్బరామయ్య, బుక్‌స్టాల్ రమణ పాల్గొన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీ

– ఇద్దరికి గాయాలు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.ఎస్సై మధుసూదన్ రావు కథనం మేరకు చెంచుగారిపల్లి గ్రామానికి చెందిన యాగల లోకేష్(18) పని నిమిత్తం స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. స్థానిక పెట్రోల్ బంకు వద్ద ఉన్న జాతీయ రహదారిపై వెళుతుండగా కడప నుంచి రాజంపేట వైపు వెళుతున్న ఏపీ 39 ఎస్‌ఎఫ్ 0707 అనే నంబర్ గల కారు ఢీ కొనడంతో లోకేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని స్వల్పగాయాలయ్యాయి. ఎస్సై మధుసూదన్ రావు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

– ఇద్దరు నిందితుల అరెస్టు

కేవీపల్లె : వాహనంతో సహా రూ. 8.20 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వడ్లకుంట ప్రాంతం నుంచి ఎర్రచందన అక్రమ రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారంతో బండవడ్డిపల్లె సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ 29 సీబీ 6874 నంబరు గల మహేంద్రా జైలో వాహనాన్ని తనిఖీ చేశారు. 60 కేజీల బరువుగల నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు.వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన రామస్వామి తంగరాజ్, కృష్ణగిరికి చెందిన కృష్ణమూర్తి మోహన్‌లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం, వాహనం విలువ సుమారు రూ. 8.20 లక్షలు విలువ ఉంటుందని చెప్పారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



జ్యోతి మృతదేహం

నారాయణవనం(తిరుపతి జిల్లా): బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థిని కళాశాల హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంత్రం నారాయణవనం మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలం కురవపల్లెకు చెందిన జనార్ధన్‌రెడ్డి కుమార్తె జ్యోతి (20) మండలంలోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతోంది. కళాశాల హాస్టల్‌లో ఉంటున్న జ్యోతి శనివారం తరగతులకు వెళ్లకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయింది. కళాశాల ముగిసిన తర్వాత 4.15 గంటల సమయంలో జ్యోతి ఉరివేసుకున్నట్టు హాస్టల్ విద్యార్థినులు గుర్తించి అధ్యాపకులకు సమాచారమిచ్చారు. జ్యోతిని వెంటనే పుత్తూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్య సిబ్బంది నిర్ధారించారు. జ్యోతి శనివారం అందరితో సాధారణంగానే మాట్లాడిందని, మధ్యాహ్నం తనతో కూడా మాములుగానే మాట్లాడిందని ఆమె అన్న జశ్వంత్ తెలిపారు. జ్యోతి ఆత్మహత్యకు కారణాలను విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

బావిలో దూకి..

కడప అర్బన్ (వైఎస్సార్‌జిల్లా) : కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని రామాంజేయపురానికి చెందిన షేక్ పీరుల్లా (35) బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే ప్రాంతానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తి గమనించి పీరుల్లా భార్య యాస్మిన్‌కు ఫోన్ చేసి చెప్పాడు. సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించింది. మృతదేహాన్ని చిన్నచౌకు పోలీసులు రిమ్స్‌కు తరలించారు. తన భర్త అప్పులు అధికంగా చేసి తీర్చలేక మనస్థాపంతో బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు చిన్నచౌకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కవి పోతురాజు సుబ్బన్న మృతి



వెంకటసుబ్బన్న (ఫైల్)

సిద్దవటం/కడప కల్చరల్ : జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా సేవలందించడంతో పాటు ప్రముఖ కవిగా పేరుపొందిన సిద్దవటం వాసి పోతురాజు వెంకట సుబ్బన్న(84) శనివారం రాత్రి 7.30 గంటలకు మృతి చెందారు. ఆయన కొన్ని రోజులుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్నారు. కాగా ఉపాధ్యాయుడిగా మంచి పేరు సాధించిన ఆయన ఉద్యోగ విరమణచేసి సాహిత్య వ్యాపకాలతో కాలం గడుపుతున్నారు. పుష్పగిరి క్షేత్రం, సిద్దవటం స్వయం వ్యక్త క్షేత్రం, అస్పృశ్య రాగాలు, పొత్తపినాడు తదితర గ్రంథాలు రాసి జిల్లాలో మంచి కవిగా గుర్తింపు పొందారు. కవన కౌముది బిరుదాంకితుడు. ఈయన ఉపాధ్యాయుడుగా పనిచేసినప్పుడు యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ, ఆలయాల కమిటీ చైర్మన్, ఇంటాక్, సీపీ బ్రౌన్ గ్రంథాలయ సభ్యుడిగా పని చేశారు. ఈయన స్వగ్రామం సిద్దవటంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. వెంకటసుబ్బన్న మృతి పట్ల పలువురు సాహితీ వేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.